క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం: బోని సబ్‌స్టేషన్ శిర్లపాలెం ఫీడర్ లైనులో చెట్ల కొమ్మలు తొలగించనున్నందున ఈ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతవరం, కొత్తకొవ్వాడ, పాత కొవ్వాడ, గంధవరం, తిమ్మాపురం గ్రామాల్లో ఆ సమయంలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

29న సామూహిక అక్షరాభ్యాసాలు

కొమ్మాది: కొమ్మాది అష్టలక్ష్మీ ఆలయంలో ఈ నెల 29వ తేదీన చిన్నారులచే సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మూల నక్షత్రం సందర్భంగా శ్రీ సరస్వతి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అక్షరాభ్యాసంలో పాల్గొనాలనుకునే వారు ముందుగా ఆలయ ప్రతినిధులను సంప్రదించాలని సూచించారు.

పీ4 సర్వే యాప్‌పై అవగాహన



యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సీపీఏపీ బృంద సభ్యురాలు

పద్మనాభం: పీ4 సర్వేను యాప్ ద్వారా పకడ్బందీగా చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వి.నగేష్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సచివాలయ సిబ్బందికి పీ4 సర్వే యాప్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బంగారు కుటుంబాలకు సంబంధించిన వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. పది మంది సభ్యులతో కూడిన సీపీఏపీ బృందం ఈ శిక్షణ ఇచ్చింది. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ జయ ఉమ పాల్గొన్నారు.

బరువు తక్కువున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



చిన్నారికి పౌష్టికాహారం అందిస్తున్న ప్రత్యేకాధికారి జ్ఞానవేణి

పద్మనాభం: బరువు తక్కువ ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి సూచించారు. మండలంలోని అనంతవరంలో శుక్రవారం పర్యటించిన ఆమె అంగన్‌వాడీ కేంద్రం, ఎన్టీఆర్ కాలనీ రూరల్ లేఅవుట్‌ను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో బరువు తక్కువ ఉన్న పిల్లలకు తన సొంత నిధులతో మల్టీ గ్రీన్ పౌడర్, ఖర్జూరం, బెల్లం, నెయ్యి, అరటి పండ్లతో కూడిన న్యూట్రిషన్ ఫుడ్ కిట్‌ను పంపిణీ చేశారు. ఆమె వెంట తహసీల్దార్ కె.ఆనందరావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ జయ ఉమ, ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, గృహ నిర్మాణ శాఖ ఏఈ పద్మజ ఉన్నారు.

గర్భిణులకు సీమంతం



కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు తదితరులు

తగరపువలస: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడని భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు అన్నారు. భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన సామూహిక సీమంతాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుష్మిత, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు, ఉప సర్పంచ్ బమ్మిడి అప్పన్న, పీఏసీఎస్ చైర్మన్ జి.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లు



గుడ్లవానిపాలెంలో వాటర్‌ప్లాంట్

అడుగంటుతున్న భూగర్భజలాలు

నివాసాల మధ్య వాటర్ ప్లాంట్ నిర్వహణ కారణంగా ఈ ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. తాగునీటి కష్టాలు తీవ్రరూపం దాల్చనున్నాయి. శుద్ధి చేయని తాగునీటి విక్రయాలు జరుగుతున్నా.. అనధికార ప్లాంట్లతో సొమ్ము చేసుకుంటున్నా, మినరల్ వాటర్ ప్లాంట్లు విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదు.



కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులోని పలు ప్రాంతాల్లో మంచినీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. బోర్లు, ప్రభుత్వ తాగునీటి పథకాలు సరిపోకపోవడంతో ప్రత్యామ్నాయంగా వాటర్ ప్లాంట్‌లపై ఆధారపడుతున్నారు ఇక్కడ ప్రజలు. ఈ అవకాశాన్ని సొమ్ము చేసుకుంటున్నారు కొందరు వ్యాపారులు. అనుమతులు లేకుండా కొన్ని ఉండగా.. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా మినరల్ వాటర్ పేరుతో సాధారణ నీటిని విక్రయిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం ప్రజల ఆరోగ్యానికి శాపంగా మారుతోంది. ఎండాడ, రుషికొండ, గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్ ప్రాంతాల్లో మంచినీటి సమస్య వేధించడంతో నిర్వాహకులు పెద్ద బోర్లను ఏర్పాటు చేసి మంచినీటిని విక్రయిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతాల్లో మినరల్ వాటర్ ప్లాంట్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. రోజుకు లక్షల్లో వ్యాపారం జరుగుతున్నా.. వీటిలో 80 నుండి 90శాతం ప్లాంట్‌లకు ఎలాంటి అనుమతులు లేకపోవడం గమనార్హం. పేరుకే మినరల్ వాటర్ ప్లాంట్స్, కానీ చాలా చోట్ల కనీసం క్లోరినేషన్ లేదా ఫిల్టరేషన్ ప్రక్రియ కూడా నిర్వహించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కలుషిత నీటిని తాగడం వలన ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. కొందరు వ్యాపారులు కేవలం సాధారణ నీటిని సీసాల్లో నింపి మినరల్ వాటర్ పేరుతో అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.



ఎండాడలో వాటర్ ప్లాంట్



ఆటోలో తరలిస్తున్న మంచినీళ్ల క్యాన్లు

నాణ్యత అంతంతమాత్రం..

ఈ ప్రాంతాల్లో ఉన్న వాటర్ ప్లాంట్ల నిర్వహణలో లోపాలు అనేకం ఉన్నాయి. ప్లాంట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. కానీ వాటిని గాలికి వదిలేశారు. వాస్తవానికి 20 లీటర్ల మినరల్ వాటర్ ధర రూ.20 లకు విక్రయించడం సాధ్యం కాదు. కానీ కొన్ని చోట్ల రూ. 10కి కూడా విక్రయిస్తున్నారంటే ఆ నీటి నాణ్యత ఏ విధంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. చాలా ప్లాంట్లలో కేవలం బోరు నీటిని క్యాన్లలో నింపి, క్లోరిన్ టాబ్లెట్లు నీటిలో వేసి మినరల్ వాటర్‌గా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు చిత్తశుద్ధితో వాటర్‌ప్లాంట్లపై తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్లాంట్లను రద్దు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్ఎస్ఆర్ఐటీలో 30 గంటల హ్యాకథాన్



హ్యాకథాన్ ప్రాధాన్యతను వివరిస్తున్న గీతం ప్రొఫెసర్ భరణి

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటీలో హ్యాక్ విత్ వైజాగ్ 3.0 ప్రతిష్టాత్మకమైన 30 గంటల హ్యాకథాన్ శుక్రవారం ప్రారంభమైంది. సీఎస్ఈ, సీఏస్ఎం, సీఎస్‌డీ విభాగాల ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమం శనివారం ముగియనుంది. ఇందులో 552 మంది విద్యార్థులు పాల్గొనగా, 273 మంది వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలో విద్యార్థులు ఉన్నారు. హ్యాకథాన్ ప్రాధాన్యత, తాజా పారిశ్రామిక ధోరణులను గీతం డీమ్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ భరణి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శంభుప్రసాద్, చీఫ్ మేనేజింగ్ అధికారి సుబ్బరాజు, సీఎస్ఈ విభాగాధిపతి ఆర్.శ్రీనివాస్, కోఆర్డినేటర్ వి.శ్రీరామమూర్తి తదితరులు ప్రసంగించారు. కళాశాల కార్యదర్శి ఎన్.ప్రసాదరాజు, చైర్మన్ సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు సారె సమర్పణ



అమ్మవారికి సమర్పించేందుకు సారె తీసుకువెళ్తున్న గ్రామస్తులు

పద్మనాభం: కృష్ణాపురంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పద్మనాభం మండలం కోరాడ, భీమునిపట్నం మండలం మజ్జిపేట వాసవి క్లబ్ సభ్యులు శుక్రవారం సారె సమర్పించారు. రకరకాల స్వీట్లు, పండ్లతో కూడిన సారెను పద్మనాభం గ్రామం నుంచి జంక్షన్ మీదుగా ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకు వచ్చారు. పూజలు చేసిన అనంతరం అమ్మవారికి సారె సమర్పించారు. పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు.

జోన్-1 కార్యాలయం ముట్టడి

- బడ్డీల తొలగింపుపై నిర్వాహకుల ఆందోళన
- అధికారులు లోనికి వెళ్లకుండా ప్రధాన ద్వారం వద్ద అడ్డగింత



అధికారులు, సిబ్బంది లోపలకు వెళ్లకుండా జోనల్ కార్యాలయం ద్వారం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు, బడ్డీల నిర్వాహకులు



జెడ్సీ అయ్యప్పనాయుడు, సీఐ తిరుమలరావుతో మాట్లాడుతున్న ఆర్.ఎస్.ఎన్.మూర్తి

భీమునిపట్నం: ఆపరేషన్‌లో లంగ్స్‌లో భాగంగా జీవీఎంసీ చేపట్టిన దుకాణాల తొలగింపులో బడ్డీలు కోల్పోయిన నిర్వాహకులు భీమిలి జోనల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎవరూ లోపలికి వెళ్లకుండా ప్రధాన ద్వారం వద్ద అడ్డుకోవడంతో.. అధికారులు, సిబ్బంది బయటే ఉండిపోయారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ తగరపువలస బైపాస్ రోడ్డు సమీపంలోని ఈఎస్ఐ ఆస్పత్రి ఆవరణను ఆనుకుని ఉన్న బడ్డీలను అధికారులు నిబంధనలకు విరుద్ధంగా తొలగించారన్నారు. ఈ స్థలం కేంద్ర ప్రభుత్వానిదని, ఇక్కడ ఎవరికీ ఇబ్బంది లేకుండా అనేక సంవత్సరాలుగా వీరు వ్యాపారాలు చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పుడు హఠాత్తుగా అధికారులు వచ్చి వీటిని తొలగించడంతో 56 కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు.

నోటీసు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారు?

వీధి విక్రయదారుల చట్టం ప్రకారం వారిని తొలగించాలంటే తప్పనిసరిగా ముందు వీరికి నోటీసు ఇవ్వాలని తెలిపారు. కానీ, అటువంటిది జరగలేదని, వీరికి సంబంధం లేకపోయినా వీటిని తొలగించడం తప్పని అన్నారు. ఇప్పుడు చిరువ్యాపారులు తీవ్రంగా నష్టపోవడంతో పాటు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, వారికి తగిన న్యాయం జరగాలని కోరారు. విషయం తెలుసుకుని పోలీసులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, సీఐ తిరుమలరావు అక్కడికి చేరుకుని ఆందోళన విరమించాలని వ్యాపారులను, సిటూ కార్యదర్శి మూర్తిని కోరారు. దీనిపై ఆయన మాట్లాడుతూ వీరికి అన్యాయం జరిగిందని, అక్కడ మళ్లీ బడ్డీలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నాలుగు రోజుల్లో విషయం తేలాలని స్పష్టం చేశారు. దీనిపై వారు మాట్లాడుతూ మళ్లీ బడ్డీలు ఏర్పాటుకు ఏమేరకు అవకాశం ఉందో ఉన్నతాధికారులతో మాట్లాడి, చర్యలు తీసుకుంటామన్నారు. ఆందోళనలో నాయకులు ఎస్.అప్పలనాయుడు, నేలాతి రాము, నర్సింగరావు, రామనాయుడు, సురేష్, గంగాధర్ పాల్గొన్నారు.

'బాలకృష్ణ వ్యాఖ్యలు సరికాదు'



బింగి హరికిరణ్ రెడ్డి

తగరపువలస: అసెంబ్లీలో ఎమ్మెల్యే బాలకృష్ణ గురువారం ప్రవర్తించిన తీరు సరికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సంగివలసలో మాట్లాడారు. గతంలో బాలకృష్ణ ఇంట్లో నిర్మాత బెల్లంకొండ సురేష్, సత్యనారాయణ అనే వ్యక్తులపై కాల్పులు జరిగినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పెట్టిన భిక్షతో బయటపడ్డారన్నారు. బాలకృష్ణ నడుపుతున్న బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి ఆరోగ్యశ్రీలో చంద్రబాబు కోట్లాది రూపాయలు బకాయి పెడితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విడుదల చేసి మానవత్వం చాటుకున్నారన్నారు. చంద్రబాబు, బాలకృష్ణను దూరం పెట్టి పవన్ కల్యాణ్‌కు ఉప ముఖ్యమంత్రి ఇవ్వడం సహించలేకపోతున్నారన్నారు. చిరంజీవి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దూషణలకు దిగడం చూస్తుంటే ఇంకా మెంటల్ తగ్గలేదని రుజువైందన్నారు. అసెంబ్లీలో గాని బయట గాని వైఎస్ జగన్‌పై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తే బాలకృష్ణ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. బాలకృష్ణ పిచ్చి ప్రేలాపనల వెనుక చంద్రబాబు ప్రేరేపణ ఉందని ఆరోపించారు.

అక్టోబర్‌లో షాపింగ్ ఫెస్టివల్

- జీఎస్టీ ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన
- 4 వారాల ప్రణాళికను వివరించిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ రేట్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నాలుగు వారాల ప్రణాళికను అమలు చేస్తున్నామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. శుక్రవారం, సెక్రటేరియట్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్'అనే నెల రోజుల కార్యక్రమం, సీజనల్ కండీషన్స్, పీఎం కుసుమ్ పథకం, బయోగ్యాస్ ప్లాంట్లు, సోలార్ విండ్ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సంబంధిత అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 22న సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం ప్రారంభమైందని, 25 నుంచి 29 వరకు పొదుపు అంశాలపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. 30 నుంచి అక్టోబరు 6 వరకు వ్యవసాయం, ఇతర వృత్తులపై వారికి, 7 నుంచి 13 వరకు విద్య, లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్, ఎలక్ట్రానిక్స్ తదితరాల గురించి వివరిస్తామన్నారు. అక్టోబరు 14 నుంచి 18 వరకు టూరిజం, సేవా రంగం, పునరుత్పాదక శక్తి, ఆటోమొబైల్స్ మొదలైన అంశాలపై అవగాహన, షాపింగ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని కలెక్టర్ వివరించారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ,యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

శ్రీమహాలక్ష్మీ నమోస్తుతే



చల్లనితల్లి: తాటితూరులో అమ్మవారికి వేపాకులతో అలంకరణ



చిప్పాడలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



యాతకుమ్మరిపాలెంలో మహాలక్ష్మిగా..



బైపాస్‌రోడ్డులోని విజయదుర్గ ఆలయంలో శ్రీమహాలక్ష్మిగా అమ్మవారు



ఎగువపేటలో ప్రత్యేక అలంకరణలో..



మహాలక్ష్మిగా దుర్గామాత

తగరపువలస/మధురవాడ/భీమునిపట్నం : శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదో రోజైన శుక్రవారం అమ్మవారు శ్రీమహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. భీమిలి మండలం తాటితూరులో శ్రీమహాదుర్గా యూత్ ఆధ్వర్యంలో 5వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. చిప్పాడలో 500మంది మహిళలతో కుంకుమపూజలు చేయించారు. భీమిలి జోన్‌లో మండపాల నుంచి కలశాలు, సారెతో ఊరేగింపు నిర్వహించారు. చంద్రంపాలెం దుర్గాలమ్మ, టైలర్స్ కాలనీ విజయదుర్గాదేవి, మానం ఆంజనేయులు నగర్ లలితాత్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జాతరగట్టు దుర్గాలమ్మ ఆలయంలో హోమం నిర్వహించి, 2 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. యాతకుమ్మరిపాలెంలో, ఎగువపేటలో గ్రామాభివృద్ధి సేవాసంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు.

చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర ఒకటోవార్డు బాలాజీనగర్, చిట్టివలస కార్మికవాడలోని అమ్మవారి మండపాలను సందర్శించారు. విజయదుర్గ ఆలయంలో స్థానికులు అమ్మవారికి సారె సమర్పించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్మికవాడలోని నీళ్ల ట్యాంకు మండపం వద్ద ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ఒకటోవార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



చిప్పాడలో కుంకుమపూజలు చేస్తున్న భక్తులు



బాలాజీనగర్ మండపంలో అమ్మవారి సన్నిధిలో సిరి సహస్ర



కార్మికవాడలో అన్నసమారాధన ప్రారంభిస్తున్న సిరి సహస్ర

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పరవాడ: నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై రాకపోకలు సాగించడం ప్రమాదకరమని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అన్నారు. లంకెలపాలెం వంతెనపై నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను శుక్రవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఇలాంటి ప్ర యాణాల ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వాహనదారులను హెచ్చరించారు.

ధైర్యలక్ష్మి సదా పాలయమాం..



ధైర్యలక్ష్మిగా దర్శనమిచ్చిన కనకమహాలక్ష్మి అమ్మవారిని భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో పూజించారు. భవభయహారిణి.. మంత్రస్వరూపిణి అయిన అమ్మ, తమకు మనోధైర్యాన్ని ప్రసాదించి, సదా కాపాడాలని ప్రార్థించారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, తులసీదళాలతో సహస్ర నామార్చన చేశారు. – డాబాగార్డెన్స్

'కన్యాకుమారి' సందడి

విద్యార్థినులతో హీరోయిన్ గీతా సైనీ ముచ్చట్లు



విద్యార్థినులతో కలసి లవ్ సింబల్ చూపిస్తున్న హీరోయిన్

మధురవాడ: 'కన్యాకుమారి'సినిమా హీరోయిన్ గీతా సైనీ, డైరెక్టర్ సృజన్ అట్టాడ శుక్రవారం మధురవాడలో సందడి చేశారు. సినిమా ఓటీటీ ప్రమోషన్‌లో భాగంగా మధురవాడలోని గాయత్రి కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా హీరోయిన్ విద్యార్థినులతో కలిసి ఉత్సాహంగా డ్యాన్స్‌లు చేశారు. అలాగే కొన్ని డైలాగులు చెప్పి అందరినీ అలరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సినిమాలో మెసేజ్ ఇచ్చినట్లు.. విద్యార్థులందరూ తమకంటూ ఒక మంచి లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, భవిష్యత్తులో మంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు.